క్లుప్తంగా

కార్మిక సంఘాన్ని బలోపేతం చేస్తాం



సమావేశమైన ఐఎన్‌టీయూసీ నాయకులు

పెద్దపల్లిరూరల్: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ ఐఎన్‌టీయూసీని బలోపేతం చేసేందుకు పాటు పడతామని జిల్లా అధ్యక్షుడు భూముల చందర్ అన్నారు. పెద్దపల్లిలో శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీపీసీసీ నాయకుడు శ్యాం, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు మేకల సతీశ్‌తో పాటు సమ్మిరెడ్డి, జమీల్, విజయమోహన్ ఉన్నారు.

విద్యార్థికి సన్మానం



సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

ఎలిగేడు: ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఎలిగేడు జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో చదివిన మండల కేంద్రానికి చెందిన కోడూరి సాహిత్య 549 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. గ్రామపంచాయతీ మాజీ ప్రజాప్రతినిధులు శనివారం విద్యార్థిని సన్మానించారు. పూర్వ సర్పంచ్ మండిగ రాయనర్సయ్య, మాజీ వార్డుసభ్యులు మామిడాల రమేశ్, కవ్వంపల్లి నారాయణ, బుర్ర రాజు, తాటిపల్లి సతీశ్‌బాబు, రామచంద్రం, సాహిత్య తల్లిదండ్రులు కోడూరి ఓంప్రకాశ్–సంధ్యారాణి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో పునరుద్ధరణ పనులు



పునరుద్ధరణ పనుల్లో విద్యుత్ ఉద్యోగులు

రామగుండం: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం పలు సాంకేతికపరమైన పనుల్లో విద్యుత్ ఉద్యోగులు బిజీగా గడిపారు. ఇందులో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగించే కేంద్రాలను గుర్తించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. దీంతో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచింది.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన కార్యదర్శులు



సమ్మేళనానికి వెళ్తున్న కార్యదర్శులు

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు శనివారం తరలివెళ్లారు. జిల్లా అధ్యక్షుడు ఎడవెల్లి సంతోష్, ప్రధాన కార్యదర్శి అంజాద్‌పాషా మాట్లాడుతూ కార్యదర్శుల సమస్యలు మంత్రులకు విన్నవించడంతో పాటు పనిఒత్తిడి లేకుండా విధులు నిర్వహించేలా సహకరించాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి మల్కాపూర్‌లో శనివారం రాత్రి పోలీసు కళాబృందంతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ పాల్గొని మాట్లాడారు. సమాజంలో అనేక రకాల మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు డయల్ చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవల కోసం డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. అనంతరం కళాబృందం ఆలపించిన గీతాలు చైతన్యపరిచాయి. హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, కానిస్టేబుల్ అంజన్న, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో వైభవంగా గరుడసేవ

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయంలో గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్‌రెడి సుదర్శన్‌రెడ్డి, అర్చకులు కొండపాక రామాచార్యులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణతకు ప్రత్యేక తరగతులు

- ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక బోధన



ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

సుల్తానాబాద్: ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కళాశాలలో, మోడల్ స్కూల్స్, కస్తూర్బాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మే 22 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డ్ ఇటీవల ప్రకటించింది.

సబ్జెక్టుల వారీగా ప్రత్యేక బోధన

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్‌లో ఫెయిల్ అయిన వారు 1490 మంది విద్యార్థులు ఉన్నారు. అందరూ ఉత్తీర్ణత సాధించేలా సబ్జెక్టుల వారీగా ఏప్రిల్ 26 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఆయా సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక తరగతులకు హాజరుకాని విద్యార్థుల కోసం ఆన్‌లైన్ ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. మే 20 వరకు ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక తరగతులు జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం లెక్చరర్ల ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ తరగతులకు విద్యార్థులు హాజరుకావాలి. విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలో వివిధ కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి.

– కల్పన, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి, పెద్దపల్లి

రైల్వేస్టేషన్‌లో పోలీసుల ముమ్మర సోదాలు



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

రామగుండం: పాక్‌తో మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న క్రమంలో దేశవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించిన విషయం తెలిసిందే. రామగుండం రైల్వేస్టేషన్‌లో శనివారం పోలీసులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ముఖ్యంగా రైల్వే పార్సిల్ కార్యాలయంలో వచ్చిన పార్సిల్స్, బుకింగ్ తదితర చిరునామాలను పరిశీలించారు. ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికుల బ్యాగ్‌లను సోదా చేశారు. కాగా బిహార్, గుజరాత్, పంజాబ్ వైపు వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అనుమానాస్పదంగా కనిపించే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచాలని రైల్వే పోలీసులకు సూచించారు. సదరు రైళ్లు రామగుండంకు వచ్చే సమయంలో తప్పనిసరిగా రైల్వేస్టేషన్‌లో పెట్రోలింగ్ చేపట్టాలని ఆదేశించారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్, అంతర్గాం, రామగుండం ఎస్సైలు వెంకటస్వామి, సంధ్యారాణి ఉన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: లేబర్ కోడ్స్ రద్దు కోసం మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. పట్టణంలోని రైస్‌మిల్స్ అసోసియేషన్ వద్ద దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. జిల్లాలోని సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, బసంత్‌నగర్ సిమెంట్ కంపెనీ, రైస్‌మిల్లు పరిశ్రమలతో పాటు జిల్లాలోని అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, రైస్‌మిల్ గుమాస్తాల యూనియన్ అధ్యక్షులు మాతంగి రాజమల్లు, లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు పోగుల తిరుపతి, రైస్‌మిల్ ఆపరేటర్స్ యూనియన్ నాయకులు పూసాల సంపత్, వీరగోని కిరణ్‌గౌడ్, కొల్లూరి రాజు, అనిల్, విలాస్, మహేశ్, రాజయ్య, ప్రశాంత్, సతీశ్, రమేశ్, సత్యం, బాలు ప్రేమ్, బాబు, తదితరులు పాల్గొన్నారు



నివాళి అర్పిస్తున్న తండా ప్రజలు

అమర జవాన్‌కు నివాళి

పాలకుర్తి: పాకిస్తాన్ జరిపిన దాడుల్లో అమరుడైన గిరిజన జాతి బిడ్డ మురళినాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని మండలంలోని బామ్లానాయక్ తండాలో పాలకుర్తి మాజీ సర్పంచ్ రాజునాయక్ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. గ్రామస్తులు లాల్ సింగ్, కెల్లన్, సారయ్య, సమ్మయ్య, మంజి, జైపాల్, బాలు, తిరుపతి, రవి, గణేశ్, అంజి నాయక్, రాజేశ్ పాల్గొన్నారు.

నర్సింగ్ స్టూడెంట్లకు క్రీడాపోటీలు



పోటీల్లో పాల్గొన్న నర్సింగ్ స్టూడెంట్స్

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ స్టూడెంట్స్‌కు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ నర్సింగ్ ఆఫీసర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గోదావరిఖని శారదానగర్‌లోని నర్సింగ్ కాలేజీ ఆవరణలో స్టూడెంట్స్‌కు పలు క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాపోటీలను కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ సుశీల ప్రారంభించారు. ఖోఖో, చైర్‌గేమ్స్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడాపోటీల్లో స్టూడెంట్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ సుశీల మాట్లాడుతూ ఈనెల 12న అంతర్జాతీయ నర్సింగ్ ఆఫీసర్స్ దినోత్సవం వేడుకలను కాలేజీలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు స్టూడెంట్స్ ఉపన్యాసాలు ఉంటాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వివరించారు.

వర్షానికి తడిసిన ధాన్యం

ఓదెల: ఓదెల మండలంలో శనివారం కురిసిన వర్షానికి ఐకేపీ సెంటర్‌లోని ధాన్యం తడిసింది. శనివారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ఓదెల, కొలనూర్, పొత్కపల్లి, గుంపుల గ్రామాల్లోని ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడిసింది. రైతులు టార్పాలిన్‌లు ధాన్యంపై కప్పారు. ధాన్యం కొనుగోళ్లను వెంటనే వేగిరం చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

అడవిశ్రీరాంపూర్‌లో గుడుంబా పట్టివేత

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో శనివారం 30లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం దుబ్బెటకు చెందిన ఆజ్మీరా సనత్‌కుమార్ అడవిశ్రీరాంపూర్ గ్రామశివారులో గుడుంబా రవాణా చేస్తుండగా తనిఖీలో భాగంగా కానిస్టేబుల్ పట్టుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితుడిని, గుడుంబాను, వాహనాన్ని పోలీస్‌స్టేషనకు తరలించామని తెలిపారు.

భారీ వర్షానికి గ్రౌండ్‌లోకి చేరిన మురికి నీరు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అకాల వర్షానికి భారీగా వరద రావడంతో గ్రౌండ్ మొత్తం నీటిమయమైంది. గ్రౌండ్‌లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని వాకర్లు, వేసవి క్రీడా శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులు అధికారులను కోరారు.

వేములవాడ గోశాలకు పశుగ్రాసం వితరణ

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకులలోని జానకి రామ ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 42 ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని వేములవాడ గోశాలకు తరలించారు. ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• డ్రైవర్‌కు 10నెలల జైలు శిక్ష

సుల్తానాబాద్‌రూరల్: అతివేగంగా లారీ నడుపుతూ ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా లారీ డ్రైవర్ ఠాగూర్ అర్జున్ సింగ్‌కు శనివారం సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ 10నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం 2016లో మండలంలోని నారాయణపూర్ ఎక్స్ రోడ్డు వద్ద లారీ డ్రైవర్ ట్రాక్టర్‌ను ఢీకొనగా కులవేని అశోక్, ఎలబోతారం కుమార్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా అప్పటి ఎస్సై కేసు నమోదు చేయగా, సాక్ష్యులను కోర్టులో హాజరు పరచగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి 10నెలల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

• అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తా

ఓదెల: ఓదెల గ్రామశివారులో ధాన్యం లారీ శనివారం అదుపు తప్పి బోల్తాపడింది. ఐకేపీ సెంటర్‌లోని ధాన్యం లోడు చేసుకొని సుల్తానాబాద్ మిల్లుకు వెళ్తుండగా మతిస్థిమితం లేని మహిళ అడ్డురాగా డ్రైవర్ తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. తిరిగి మరోలారీలో కిందపడిన ధాన్యం లోడుచేసి మిల్లుకు పంపారు.

• గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

రామగిరి: గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రామగిరి ఎస్సై పెట్టం చంద్రకుమార్ అన్నారు. మండలంలోని కల్వచర్ల గ్రామంలోని కమాన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించిన కల్వచర్లకు చెందిన పులి రాకేశ్‌ను పట్టుకుని పరిశీలించగా 90గ్రాముల గంజాయి లభించింది. గంజాయి విక్రయిస్తున్న వ్యకిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయించినా, సేవించినా చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

• ఇద్దరు దొంగల పట్టివేత

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని దేవునిపల్లి శ్రీలక్ష్మీనంబులాద్రి దేవాలయంలో ఈనెల 8న అర్ధరాత్రి 15కిలోల ఇత్తడిని దొంగలు ఎత్తుకెళ్లారు. కాగా చైర్మన్ కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా శనివారం ఇద్దరు దొంగలను పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం శనివారం నారాయణపూర్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన జూలపల్లి మండలం తేలుకుంటకు చెందిన కుర్ర రవి, అతని మిత్రుడు పెద్దపల్లి శాంతినగర్‌కు చెందిన ఎండీ అన్వర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి ఇత్తడిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.


• తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన శ్రీనివాస్(42) అనే గీత కార్మికుడు శనివారం సాయంత్రం తాటిచెట్టుపై నుంచి కింద పడగా తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

• ఆపరేషన్ సిందూర్‌కు తరలిన ఆర్మీ రైళ్లు

ఓదెల: సికింద్రాబాద్ నుంచి ఆపరేషన్ సిందూర్ కోసం ఆర్మీ రైళ్లు కాశ్మీర్‌కు తరలివెళ్లాయి. శనివారం కాజీపేట్ మీదుగా రామగుండం, బల్లార్షా మీదుగా కాశ్మీర్ వైపునకు వరుసగా ఆర్మీ రైళ్లు వెళ్లడంతో జమ్మికుంట, ఓదెల, పెద్దపల్లి, రామగుండం రైల్వేస్టేషన్ల ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. ప్రత్యేక రైళ్లలో యుద్ధ ట్యాంకర్లు, ఆయుధాలు, యూనిఫాం ఆర్మీ జవాన్లు రైళ్ల బోగీల్లో తరలివెళ్లారు.

నాసిరకంగా అభివృద్ధి పనులు



సుల్తానాబాద్: పట్టణంలో అభివృద్ధి పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. పోలీస్‌స్టేషన్ నుంచి పాత జెండా వరకు జరుగుతున్న అభివృద్ధి పనులు నాసిరకంగా చేయడంతో కంకర లేస్తోంది. వారం నుంచి క్యూరింగ్ చేయకపోవడంతో ఇళ్లలోకి దుమ్ముతో పాటు వాహనాలు వెళ్లడంతో రాళ్లు వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. సీసీరోడ్డు వేసిన ప్రాంతంలో ఇప్పుడే గుంతలు పడుతున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నాణ్యతతో కూడిన పనులు చేట్టాలని ఎమ్మెల్యే విజయరమణారావు చెప్పినప్పటికీ కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేయడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రామగుండం: కార్పొరేషన్ 22వ డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్ కాలనీలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. కాలనీలోని ప్రవేశద్వారం వద్ద ఉన్న బొడ్రాయి సమీపంలో డ్రైనేజీలో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దీంతో దుర్వాసన, దోమల బెడదతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ స్పందించి క్షేత్ర పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

అధికారులందరూ అందుబాటులో ఉండాలి



సమావేశమైన ఇన్‌చార్జి జీఎం రాముడు

గోదావరిఖని: దేశంలో అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో సింగరేణి అధికారులందరూ విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ–2 ఇన్‌చార్జి జీఎం రాముడు సూచించారు. శనివారం అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రతీఒక్కరు పనిస్థలాల్లో అందుబాటులో ఉండాలని, అధికారులందరూ విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్ నరసింహారావ్, వర్క్‌షాప్ ఏజీఎం ఎర్రన్న, ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్, వకీల్‌పల్లి ఏజెంట్ ఎ.నెహ్రూ, ఏరియా రక్షణ అధికారి సంతోష్‌కుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీ, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, క్వాలిటీ డిప్యూటీ మేనేజర్ సుభాస్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



గోదావరిఖని: ర్యాలీలో రిక్రియేషన్ క్లబ్ సభ్యులు



మంథని: ర్యాలీలో పుట్ట మధు



ముత్తారంలో బైక్ ర్యాలీ

గోదావరిఖని: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం టీ జంక్షన్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, రామగుండం రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు బల్మూరి అమరేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీనివాస్, నాయకులు చెరుకు బుచ్చిరెడ్డి, తూముల అశోక్‌రావు, జీవన్‌బాబు నిట్టూరి, చందుపట్ల తిరుపతిరెడ్డి, చింతల రాజిరెడ్డి, చందుపట్ల మల్లారెడ్డి, మారుపాక రాజేంద్రకుమార్, బంక రామస్వామి, కొమురవెల్లి సుధాకర్, బండారి ఓదెలు, ప్రముఖ న్యాయవాది భాగవతుల శాంతన్‌కుమార్, బయ్యగోని శ్రీనివాస్, నలుమాసు సత్యనారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ

మంథని: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంథనిలో శనివారం భారత జవాన్లకు సంఘీభావం తెలుపుతూ మహాత్మాజ్యోతిరావు పూలే చౌక్ నుంచి చాకలి ఐలమ్మ చౌక్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పాల్గొని మాట్లాడరు. మంథనిలో అన్నివర్గాల ప్రజలు వ్యాపారులు షాపులు మూసివేసి సంఘీభావ ర్యాలీలో పాల్గొని సైనికులకు సంఘీభావం తెలిపారన్నారు. పాకిస్తాన్ తీవ్రవాదుల దాడిలో అమరుడైన మురళీధర్ నాయక్, పహల్గాం మృతులకు నివాళి అర్పించి సంతాపం తెలిపారు.

ముత్తారంలో..

ముత్తారం: పాక్ దాడిలో మరణించిన వీర జవాన్లకు మద్దతుగా శనివారం రాత్రి ముత్తారంలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అడవిశ్రీరాంపూర్ నుంచి ఓడెడ్, ముత్తారం, కేశనపల్లి వరకు బైక్ ర్యాలీ తీసి వీర జవాన్లకు సంఘీభావం తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మారం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిరుదు గట్టయ్య, మూగ మల్లేశ్, పెయ్యల కుమార్, ఎర్రబెల్లి సింగారావు, బొడ్డు సారయ్య, మోత్కూరి స్వామి, ఆకోజ్ రమేశ్, పరికిపండ్ల మొగిళి, లింగం ఉమాశంకర్, మారం శంకర్, రత్న సమ్మయ్య, ఐత రమేశ్, సదయ్య పాల్గొన్నారు.

జిగేల్‌మంటున్న రామగుండం రైల్వేస్టేషన్



రామగుండం: కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకంలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్న రామగుండం రైల్వేస్టేషన్ రాత్రివేళల్లో కనువిందు చేస్తోంది. రెండేళ్ల క్రితం రామగుండం వచ్చిన ప్రయాణికులు ఇప్పుడున్న రైల్వేస్టేషన్‌ను చూసి ఒక్కసారిగా అవాక్కవుతున్నారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలో పచ్చటి పార్కులు ఏర్పాటు చేయడంతో రైలు ఆలస్యం ఉంటే ప్రయాణికులు ఇందులోనే సేద తీరుతున్నారు. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో రామగుండం రైల్వేస్టేషన్ జిగేల్‌మంటోంది.